క్లుప్తంగా

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం జ్యోతికరెడ్డి శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. ఇందులో పుష్పాంజలి, చతుస్రా అలరిపు, నటేశకౌతం, జతిస్వరం, భో శంభో, కల్యాణి జతిస్వరం, గోకులంబుడి శబ్దం, అంబస్తుతి, శివ పంచాక్షరీ స్తోత్రం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు సహస్ర, హాసిక, పూర్వి, కృతిక, స్నిగ్ధ, హితశ్రీ, ఆరాధ్య, శాన్విత, పూర్ణ, సరిత్రక, హంసిక, హర్షిత, తదితరులు పాల్గొని అలరించారు. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ అవార్డీ కళారత్న పసుపర్తి రామలింగ శాస్త్రి, నాట్యగురువు నిర్మలా ప్రభాకర్‌లు కళాకారులను సత్కరించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మాదాపూర్: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ కమిషనర్ హర్షవర్ధన్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఫుడ్ డెలివరీ ఏజెంట్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., స్విగ్గి, జొమాటో, బ్లింకిట్ లాంటి ఏజెంట్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్లపై అతివేగంగతో వెళ్లకూడదని, హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని కోరారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్ చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ హనుమంత రావు, మాదాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, రాయదుర్గం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్‌రెడ్డి, నార్సింగ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లోన్ పేరిట బురిడీ.. ఒకరి అరెస్ట్

గచ్చిబౌలి: లోన్ ఇప్పిస్తానని నమ్మించి ప్రాసెసింగ్, జీఎస్‌టీ పేరిట అందినకాడికి దండుకొని మోసాలకు పాల్పడుతున్న ఒకరిని అరెస్ట్ చేసిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. టిలికాం నగర్‌కు చెందిన ఓ వ్యక్తికి పర్సనల్ లోన్ ఇప్పిస్తానని నమ్మించి బేగం బజార్ వద్ద నివాసం ఉండే వెంకటేష్(28) ప్రాసెసింగ్ కోసం రూ.5 వేలు తీసుకున్నాడు. అనంతరం ఫోన్‌ను బ్లాక్ చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, రాయదుర్గం పీఎస్‌ల పరిధిలో మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

భార్యను హత్య చేసిన నిందితుడి రిమాండ్

మియాపూర్: భార్యను హత్య చేసిన నిందితుడిని చందానగర్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా, తాండూర్ సమీపంలోని అల్లాపూర్‌కు చెందిన నరేందర్‌గౌడ్ (27) ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య అంబిక మధ్య గొడవలు పెరగడంతో కక్ష్య పెంచుకొని అంబిక పనిచేస్తున్న బొటిక్‌కు వెళ్లి గొంతు కోసి హత్య చేసిన విషయం తెలిసిందే. హత్య చేసిన అనంతరం నరేందర్‌గౌడ్ పారిపోతుండగా స్థానికులు అడ్డుకొని చందానగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి విచారించగా తన భార్య అంబిక ఐదేళ్ల నుంచి వేర్వేరుగా ఉంటున్నామని, తనతో కలిసి జీవించేందుకు ఒప్పుకోకపోవడం, అదే విధంగా కూతురుని కూడా మాట్లాడనివ్వకపోవడంతో కోపంతో హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతనిపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

రామచంద్రాపురంలో రాయల్ ఓక్ స్టోర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఫర్నిచర్ బ్రాండ్ రాయల్ ఓక్ తన నూతన 148వ స్టోర్‌ను శనివారం రామచంద్రపురం పట్టణంలో ప్రారంభించింది. సినీహీరో నిఖిల్ సిద్ధార్థ చేతుల మీదగా ఈ స్టోర్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాయల్ ఓక్ చైర్మన్ విజయ్ సుబ్రహ్మణ్యం, మేనేజింగ్ డైరెక్టర్ మదన్ సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ మహేశ్వరి విజయ్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ

గుర్రపు డెక్క.. తొలగించకుంటే ఎట్లా..?

- రేగులకుంట చెరువులో అసంపూర్తిగా గుర్రపు డెక్క తొలగింపు
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- చెరువులో నుంచి తొలగించి చెరువు అంచుల్లోనే వేస్తున్న వైనం
- మళ్లీ విస్తరిస్తున్న గుర్రపు డెక్క



దీప్తీశ్రీనగర్‌లోని రేగులకుంట చెరువులో అసంపూర్తిగా వదిలేసిన గుర్రపు డెక్క



చెరువు అంచుల్లోనే వేసిన గుర్రపు డెక్క

మియాపూర్: చెరువుల సుందరీకరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యింది. కనీసం చెరువుల్లో ఉన్న గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించడంలో అధికారులు విఫలమవుతున్నారు. చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించేందుకు ప్రభుత్వం లక్షల రూపాయాలు నిధులు వెచ్చిస్తున్నారు. కానీ మళ్లీ కొన్ని రోజులకే విస్తరించిపోతోంది. అధికారులు, కాంట్రాక్టర్లకు గుర్రపు డెక్క తొలగించేందుకు అప్పగిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా గుర్రపు డెక్క తొలగించి చెరువు కట్టల పైనే వేస్తున్నారు. వాటిని అక్కడ నుంచి తొలగించకపోవడంతో మరల గుర్రపు డెక్క విస్తరిస్తోంది. దీంతో నీరు కలుషితమై దుర్వాసన, దోమలు వృద్ధి చెందుతున్నాయి.

నీటిని శుద్ధి చేయాలి...

- చందానగర్‌లోని దీప్తీశ్రీనగర్‌లో 17.24 గుంటల విస్తీర్ణంలో రేగులకుంట చెరువు ఉంది. ఈ చెరువుపై భాగంలో డంపింగ్‌యార్డు ఉంది. వర్షాకాలంలో వర్షాలకు డంపింగ్ యార్డుల నుంచి వరద నీరు వచ్చి చెరువుల్లో చేరుతోంది. అదేవిధంగా పై భాగంలో ఉన్న అపార్ట్‌మెంట్లు కాలనీ నుంచి మురుగు నీరు చెరువుల్లో చేరుతోంది. దీంతో నీరు కలుషితమై దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాటు చెరువుల్లో గుర్రపు డెక్క విస్తరించి దోమలు వృద్ధి చెందుతున్నాయి.
- దీంతో కాలనీవాసులు దుర్వాసన భరించలేక, దోమలు వృద్ధి చెందడంతో అనారోగ్య పాలవుతున్నామని గుర్రపు డెక్కను తొలగించి నీటిని శుద్ధి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశారు.
- చెరువు కలుషితమయ్యిందని 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

గుర్రపు డెక్క తొలగించడంలో నిర్లక్ష్యం..

- లక్షల రూపాయాల నిధులు వెచ్చించి రెండు నెలల క్రితం రేగులకుంట చెరువులోని గుర్రపు డెక్క తొలగించేందుకు పనులు ప్రారంభించారు.
- పట్టుమని పది రోజుల పాటు గుర్రపు డెక్కను యంత్రాల సాయంతో తొలగించి ఆ తరువాత వదిలేశారు. చెరువుల్లో కొంత భాగం తొలగించిన గుర్రపు డెక్కను చెరువు అంచుల్లో, చెరువు కట్టపై వేశారు. తొలగించిన గుర్రపు డెక్కను చెరువు అంచుల నుంచి తొలగించలేదు.
- అదే విధంగా చెరువుల్లో సుమారు సగభాగం గుర్రపు డెక్క అలాగే ఉండిపోయింది. దీంతో గుర్రపు డెక్క తొలగించిన ప్రాంతంలో కూడా మరల విస్తరిస్తోంది.
- గుర్రపు డెక్కను అసంపూర్తిగా తొలగించడంతో పాటు చెరువుల్లో మురుగు నీరు కలవడంతో ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారు.
- లక్షల రూపాయాల ప్రజాధనం వెచ్చించి పనులు చేపట్టిన సమస్య పరిష్కారం కాకపోవడం, పనులు అసంపూర్తిగానే ఉండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ఉన్నతాధికారులు స్పందించి దీప్తీశ్రీనగర్ రేగులకుంట చెరువులో పూర్తిగా గుర్రపుడెక్కను తొలగించి మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఒక చేతిలో స్టీరింగ్.. మరొక చేతిలో పావురం..



గుంతలోకి దూసుకుపోయిన బస్సు



రోడ్డుపై కూర్చున్న ప్రయాణికులు

- జాతీయ రహదారిలోని గుంతలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
- తప్పిన పెను ప్రమాదం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఒక చేతిలో పావురాన్ని పట్టుకొని, మరో చేతితో బస్సును నడపటంతో అదుపు తప్పి బస్సు జాతీయరహదారి పక్కన ఉన్న గుంతలోకి దూసుకుపోయింది. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం రామచంద్రాపురం పట్టణంలోని గండమ్మ ఆలయం సమీపంలో జరిగింది. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హెచ్‌సీయూ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సికింద్రాబాద్ నుంచి పటాన్‌చెరుకు వస్తోంది. బస్సు వస్తున్న క్రమంలో కేపీహెచ్‌బీ వద్ద ఓ పావురం బస్సుకు ఎదురుగా వచ్చింది. దాంతో బస్సు డ్రైవర్ దస్తగిర్ బస్సును ఆపి ఆ పావురాన్ని పట్టుకోమని ఓ ప్రయాణికుడికి చెప్పాడు. అతడు పావురాన్ని పట్టుకొని బస్సులో కూర్చున్నాడు. ప్రయాణికుడు లింగంపల్లిలో బస్సు దిగుతూ ఆ పావురాన్ని డ్రైవర్ దస్తగిరికి ఇచ్చాడు. లింగంపల్లి నుంచి జ్యోతినగర్ వరకు జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా గండమ్మ ఆలయం సమీపంలో రోడ్డు పక్కన పెద్ద గుంత తవ్వారు. ప్రమాదాలు జరగకుండా సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేశారు. డ్రైవర్ బస్సును కొంచెం వేగంగా నడపటంతో అదుపు తప్పి సిమెంట్ దిమ్మెలను ఢీకొని గుంతలోకి దూసుకు పోయింది. ఆ సమయంలో బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులున్నారు. అందరు స్వల్పగాయలతో బయటపడ్డారు. దీంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు.

చిత్ర ప్రదర్శన ప్రారంభం



చిత్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న లక్ష్మి

మాదాపూర్: కళాకారుడు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం కళాకారుడు సుధాకర్ చిప్ప వేసిన చిత్రాలను చేంజింగ్ టెరైన్స్ పేరిట ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. ఈ ప్రదర్శన 51 చిత్రాలను అందుబాటులో ఉంచినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 22వ తేదీ వరకు కొనసాగనుందని, ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు



ఖాజాగూడలో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, స్థానికులు

రాయదుర్గం: కాలనీల్లోని సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఖాజాగూడలో కాలనీవాసులతో కలిసి ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా ఆయన ఫోన్‌లో అధికారులకు సమాచారం అందించి వెంటనే పైప్‌లైన్ వేసి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, తాగునీరు, వీధిదీపాల పనితీరును తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రానున్న కాలంలో సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరించడానికి తగిన ప్రణాళికతో ముందుకుసాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ నరేందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, నాయకులు వెంకటేష్, నక్క శివకుమార్, రాఘవేంద్ర, అరుణ్‌గౌడ్, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వసుమతికి ఘన నివాళి



వసుమతి ప్రథమ వర్ధంతి వేడుకల్లో వృద్ధాశ్రమవాసులు

రాయదుర్గం: కొండాపూర్‌లోని సీఆర్‌ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో కంకణాల వసుమతికి శనివారం నివాళులర్పించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కే. నారాయణ సతీమణి కంణాల వసుమతిదేవి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని సీఆర్ ఫౌండేషన్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నారాయణ, కుమార్తె స్పందన, మనుమడు అమన్ పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు డాక్టర్ ఏబీకే ప్రసాద్, కోశాధికారి చెన్నకేశవరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె రజని, సీపీఐ నాయకురాలు కాట్రగడ్డఅరుణ, వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు తుకారామ్, డాక్టర్ పి సరస్వతి, రాజేంద్ర రావు, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమవాసులు, వసుమతిదేవి కుటుంబసభ్యులు నివాళులర్పించారు. నారాయణ, వసుమతి దంపతుల కుమార్తె స్పందన సీఆర్ ఫౌండేషన్‌కు తన తల్లి సంస్మరణార్థం రూ.లక్ష నగదు విరాళాన్ని అందజేశారు.

'హైదరాబాద్ టుడే కాంక్లేవ్' పై చర్చ



మాట్లాడుతున్న పల్లవి స్కూల్స్ చైర్మన్ మల్క కొమురయ్య

రాయదుర్గం: 'హైదరాబాద్ టుడే కాంక్లేవ్'పేరిట ప్రతి ఆరు మాసాలకోసారి అంతర్జాతీయ స్థాయిలో చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తామని పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మల్కకొమురయ్య పేర్కొన్నారు. పల్లవిగ్రూప్ ఆఫ్ స్కూల్స్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మెటమొర్ఫోసిస్‌లు సంయుక్తంగా నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షరటాన్ హోటల్‌లో రెండు రోజులపాటు సాగే 'హైదరాబాద్ టుడే కాంక్లేవ్(హెచ్‌టీసీ) అంతర్జాతీయ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం నూతన విద్యావిధానం, సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఈ కాంక్లేవ్‌కు సింగపూర్‌తోపాటు దేశ వ్యాప్తంగా ఉన్న పలు స్కూల్స్ నుంచి ప్రిన్సిపాళ్లు, టీచర్లు పాల్గొని నూతన విద్యా విధానాన్ని విద్యార్థుల్లోకి ఎలా తీసుకెళ్లాలో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం పట్ల చాలా స్కూల్స్‌కు అవగాహన కల్పించడానికి ఈ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. మొదటి రోజు స్కూల్ ఎడ్యుకేషన్‌పై, రెండవ రోజు హయ్యర్ ఎడ్యుకేషన్‌పైన చర్చా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆదివారం జరిగే కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయ ప్రకాశ్‌నారాయణ, తెలంగాణ రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా పల్లవి స్కూల్ చీఫ్ కో ఆర్డినేటర్ యశస్విమల్క, మెటమొర్ఫోసిస్ సహా వ్యవస్థాపకులు పవన్ ప్రసంగించారు.

అయ్యో 'పాప'ం

- రోడ్డు పక్కన అప్పుడే పుట్టిన ఆడశిశువు
- వదిలి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- ఐసీడీఎస్, పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు
- సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి శిశువును తరలింపు



గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన ఆడశిశువు

పటాన్‌చెరు టౌన్: మానవత్వం రాను రాను మంటగలుస్తోంది. తల్లి పొత్తిళ్లలో వెచ్చగా నిద్రించాల్సిన పసిగుడ్డు అనాథగా మిగిలింది. అప్పుడే పుట్టిన ఆడశిశువును గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన వదిలి వెళ్లారు. ఈ దయనీయ సంఘటన భానూర్–బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. బీడీఎల్ ఎస్ఐ సాయిలు, ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్ సల్మా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం క్యాసారం ఎస్సీ కాలనీలో అప్పుడే పుట్టిన ఆడశిశువు రోడ్డు పక్కన శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. చిన్నారి ఏడుపు విన్న స్థానికులు వెంటనే ఐసీడీఎస్ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సల్మా, ఎస్ఐ సాయిలు సంఘటన స్థలానికి చేరుకొని శిశువును సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాప ఆరోగ్యంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలో బీఆర్‌ప్యానెల్స్ కొత్త స్కూలర్ నెక్స్ జర్మనీ ప్రీమియం కిచెన్‌లు



రాయదుర్గం: బీఆర్‌ప్యానెల్స్ కొత్త స్కూలర్ నెక్స్ జర్మనీ ప్రీమియం కిచెన్‌లు అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేసినట్లు ప్రకటించారు. శుక్రవారం రాత్రి రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్ ఐఐఐడీ–హెచ్ఆర్‌సీ డిజైన్ అవార్డ్స్–2022 కార్యక్రమంలో ప్రకటించారు. మాడ్యులర్ కిచెన్, వార్డ్‌రోబ్ తయారీదారు ఇంటీరియర్ డిజైన్ కంపెనీ అయిన బీఆర్ ప్యానెల్స్ త్వరలో జూబ్లీహిల్స్‌లోని తమ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో స్కూలర్ నెక్స్ జర్మనీ కిచెన్‌లను ప్రారంభిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. బీఆర్ ప్యానెల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి సాగరిక మాట్లాడుతూ.. మాడ్యులర్ కిచెన్‌లు, వార్డ్‌రోబ్‌లు లేదా యాక్సెంట్‌ల కోసం వినియోగదారుల అవసరాలను మరింత మెరుగ్గా అర్థం చేసుకోవడానికి బీఆర్ ప్యానెల్స్ దానిగొప్ప అనుభవం, నైపుణ్యాన్ని కలిగి ఉంటాయన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి బురిడీ

- పార్ట్ టైం ఉద్యోగం అంటూ అపరిచితుడి మెసేజ్
- కమీషన్ ఇస్తామంటూ ఆశ చూపిన వైనం
- రూ.8.35 లక్షల నగదు పోగొట్టుకున్న ఉద్యోగిని

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పెద్దమొత్తంలో నగదు పోగొట్టుకుంది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రచనకి ఈనెల 8వ తేదీన వాట్సాప్ ద్వారా పార్ట్ టైం ఉద్యోగం అంటూ మెసేజ్ రావడంతో లింక్ క్లిక్ చేసింది. దీంతో టెలిగ్రామ్ ద్వారా ఓ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. బాధితురాలు వారు చెప్పిన విధంగా వివరాలను నమోదు చేసింది. మెదట రూ.వెయ్యి నుంచి ఇన్వెస్ట్ చేస్తూ, వారు చెప్పిన విధంగా టాస్కులు చేస్తూ, పలు దఫాలుగా మొత్తం రూ.8.35 లక్షల నగదును ఇన్వెస్ట్ చేసింది. ఇన్వెస్ట్ చేసిన నగదును ఒకేసారి డ్రా చేసుకోవచ్చని చెప్పి నమ్మబలికారు. కమీషన్ తో పాటు పెట్టిన నగదును ఇవ్వాలని బాధితురాలు అడగటంతో అతడె స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన రచన ముందుగా సైబర్ క్రైం లో ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రంజాన్ పర్వదినం చాలా పవిత్రమైనది



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

రాయదుర్గం: ముస్లింలకు రంజాన్ పర్వదినం ఎంతో పవిత్రమైనదని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. రాయదుర్గంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పర్వదినం వేళలో ముస్లింలు నిష్ఠతో పాటించే ఉపావాస దీక్షలు, దైవ ప్రార్థనలతో మతసామరస్యం, శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని సూచించారు. ముస్లింల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేస్తుందని వాటన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దారుగుపల్లి నరేష్, అక్బర్, ఇబ్రహీమ్, సలావుద్దీన్, కుతుబుద్దీన్, అంజద్ పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- ఒకరి అరెస్ట్

గచ్చిబౌలి: ప్రముఖ ఐటీ కంపెనీలలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసానికి పాల్పడిన ఓ యువకుడిని అరెస్ట్ చేసిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లో నివాసం ఉంటున్న ఓ నిరుద్యోగికి అడ్డగుట్టలో నివాసం ఉండే కడప జిల్లాకు చెందిన రాజుల సమరసింహారెడ్డి ఇన్‌స్టాగామ్‌లో పరిచయం అయ్యాడు. ఓ ప్రముఖ ఐటీ కంపెనీలో బ్యాక్ డోర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి అడ్వాన్స్‌గా రూ.20 వేలు తీసుకున్నాడు. ఫోన్ నంబర్‌ను బ్లాక్‌లో పెట్టడంతో బాధితుడు గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించాడు. దీంతో నిందితుడు సమరసింహారెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళల అదృశ్యం



లక్ష్మి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తల్లి కనిపించడంలేదని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ భాస్కర్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. 12వ తేదీన భాస్కర్ తల్లి లక్ష్మి ఇంట్లో గొడవపడి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. డీఎన్ కాలనీలో ఉండే పెద్దమ్మ ఇంటికి వెళ్లి ఉంటుందని కుమారుడు భావించాడు. అక్కడికి వెళ్లగా తల్లి కనిపించలేదు. దీంతో తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. తల్లి కనిపించడంలేదని కుమారుడు భాస్కర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్నాపూర్‌లో...



వసంత (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భార్య కనిపించడంలేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఎస్ఐ ప్రసాద్ రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ డీఎన్ కాలనీకి చెందిన శ్రీధర్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 13వ తేదీన శ్రీధర్ డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగా భార్య వసంత కనిపించలేదు. అంతేకాకుండా ఆమెకు సంబంధించిన వస్తువులు ఇంట్లో కనిపించలేదు. దీంతో భార్య కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. భార్య కనిపించడంలేదని శ్రీధర్ పోలీసులు ఫిర్యాదు చేశాడు.